సెంట్రల్‌లో పోలింగ్ ప్రశాంతం

- ఉదయం ఆరు నుంచే క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు
- 68.15 శాతం పోలింగ్ నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఒకటి రెండు బూత్‌లలో కొద్ది సేపు ఈవీఎంలు మొరాయించినప్పటికీ పూర్తిగా ఎక్కడా ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా పోలింగ్ జరిగింది. మొత్తం 267 పోలింగ్ కేంద్రాల్లో 68.15 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ఉదయం ఆరు గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మహిళలు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద చక్కటి ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. వాతావరణం కూడా అనుకూలించడంతో ఓటు వేసేందుకు క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉన్నారు. నియోజకవర్గంలో 2019లో 65.73 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 68.15 శాతం నమోదైంది.

బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన భవితవ్యం..

నియోజకవర్గంలో మొత్తం 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జూన్ నాలుగో తేదీన వీరి భవితవ్యం తేలనుంది. మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో అధికార పార్టీకి అనుకూలంగా మారిందని పలువురు భావిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం అభ్యర్థులు ఉదయం నుంచి పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు. తన గెలుపు ఖాయమని ఆయన ధీమాగా ఉన్నారు. పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన జగన్ ప్రభుత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారని వెలంపల్లి పేర్కొన్నారు.


సత్యనారాయణపురం ఏకేటీపీ స్కూల్ వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు


సింగ్‌నగర్ వివేకానంద స్కూల్‌లో ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో వేచి ఉన్న మల్లాది విష్ణు

పోలింగ్ కేంద్రాలకు బారులు తీరిన ఓటర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఓటర్లు బారులు తీరారు. ఉదయం ఆరు గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్లలో ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు. కొత్తగా ఓటు వచ్చిన యువతతో పాటు వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు..

దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాల, అయోధ్యనగర్ సూర్య పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించా యి. దీంతో ఓటు వేసేందుకు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న ప్రతీ ఒక్కరిచేత ఓటు వేయించారు. అయితే అయోధ్యనగర్ సూర్య పబ్లిక్ స్కూల్‌లో సాయంత్రం 6.15కు వచ్చిన కొంత మంది ఓటర్‌లు తమకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలంటూ పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాము క్యూలైన్‌లో నిల్చున్నప్పటికీ మధ్యలో బయటకు వెళ్లి వచ్చామని కావున ఓటు వేసే అవకాశం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అయితే తాము నిబంధనల మేరకు ఆరు గంటల తర్వాత వచ్చిన వారిని ఓటు వేయించలేమంటూ పోలీసులు తేల్చి చెప్పారు.


వన్ టౌన్ సుందరయ్య స్కూల్‌లో ఓటు వేసి వస్తున్న వెలంపల్లి దంపతులు

ఓటు హక్కు వినియోగించుకున్న గౌతంరెడ్డి...

ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సత్యనారాయణపురంలో సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి పవిత్రమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే 29వ డివిజన్ మధురానగర్‌లో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ బందెల దయానందం కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ప్రతి ఒక్కరూ దానిని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వెలంపల్లి దంపతులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు వన్ టౌన్ సుందరయ్య స్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి శ్రీవాణితో కలిసి బూత్ నెంబర్ 180లో సోమవారం ఉదయం ఓటు వేశారు. అలాగే సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుటుంబ సమేతంగా సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ స్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తన కుటుంబ సభ్యులతో కలిసి సింగ్‌నగర్ గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో ఓట్లు వేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ స్కూల్‌లో తన కుటుంబంతో కలిసి ఓటు వేశారు.


సరళాదేవి కల్యాణ మండపంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా


సత్యనారాయణపురంలో ఓటు వేసిన డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి


వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ బందెల దయానందం కుటుంబసభ్యులు


మధురానగర్‌లో క్యూలైన్


అయోధ్యనగర్‌లో క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు


ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

క్లుప్తంగా

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే వెలంపల్లి



విజయవాడస్పోర్ట్స్: ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన బూత్‌లో పోలింగ్ సరళిని వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అధికారుల అనుమతి లేకుండా టీడీపీ నాయకులు బూత్‌లోకి అనధికారికంగా ప్రవేశించి హల్‌చల్ చేశారు. దీనికి వైఎస్సార్ సీపీ నాయకులు అభ్యంతరం చెప్పడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పార్టీ సానుభూతి పరుల నుంచి సమాచారం అందుకున్న వెలంపల్లి శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకోవడంతో టీడీపీ నాయకులు అక్కడ నుంచి ఉడాయించారు. అనంతరం పోలింగ్ సరళిని వెలంపల్లి పరిశీలించారు.

పది ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): సీబీఎస్‌ఈ బోర్డు సోమవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో విజయవాడ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారని ఆ స్కూల్ రీజినల్ ఇన్‌చార్జి రావి పద్మ తెలిపారు. తమ విద్యార్థులు వి.రుషి తన్మయి 489/500 మరో ఆరుగురు విద్యార్థులు 480కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి శ్రీచైతన్య పాఠశాలల ఈజీఎం ఎం. మురళీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. శ్రీ చైతన్య యాజమాన్యం నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపించడంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల కృషి ఉందన్నారు. పాఠశాల రీజినల్ ఇన్‌చార్జ్ పద్మ, ప్రిన్సిపాల్ యు.రజిత, జోనల్ డీన్ వెంకటేశ్వర్లు, డీన్ రామకృష్ణ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యత ముందు తలవంచిన అనారోగ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చైతన్యవంతులైన ఓటర్లు వయసు, అనారోగ్యం, వైకల్యాని లెక్క చేయకుండా ఓటు వేశారు. విద్యాధరపురంలో నివసిస్తున్న ఒక మహిళ ఇటీవలె ఆపరేషన్ చేయించుకుంది. లేవలేని పరిస్థితుల్లో కూడా తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఆకాంక్షతో విద్యాధరపురం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యుల సహకారంతో వచ్చింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆమెను వీల్ చైర్‌లో కూర్చోబెట్టి ఓటు వేయించి తిరిగి జాగ్రత్తగా ఇంటికి పంపించారు.

సీబీఎస్ఈలో ఎన్ఎస్ఎం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పటమట(విజయవాడతూర్పు): సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఎన్ఎస్ఎం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రాయపరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది తమ పాఠశాల నుంచి 269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా అందులో 36 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. వీరిలో కలిదిండి లాస్య 488, శీపన సాయి రోహిత్ 486, సిరిగిరి వెంకట సాయిచరణ్ 481 మార్కులు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్య అభినందన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ మాంటి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎన్ఎస్ఎం పాఠశాల యాజమాన్యం

సీబీఎస్ఈ టెన్త్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీబీఎస్ఇ బోర్డు సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో విజయవాడ నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో సత్తా చాటారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. తమ విద్యార్థులు తటవర్తి రిషబ్ 494/500, యస్.రఘునందన్ 491/500లు సాధించి విజయవాడ సిటీ టాపర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, యం రోహిత వైష్ణవి 488, యస్ హిమతస్య 485, సీహెచ్ లక్ష్మీశరణ్య 485, కె.దేవీప్య 485, యం బావేష్ 484, పి పద్మపావని 484, జి సాయికార్తీకా సాత్విక 483 మార్కులు సాధించినట్లు తెలిపారు. కాగా 286 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 35 మంది 470కిపైగా మార్కులు సాధించగా, 52 మంది 450కి పైగా సాధించినట్లు తెలిపారు. మరో 149 మంది 400లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని స్కూల్ కరస్పాండెంట్ ఎ.విజయబాబు అభినందనలు తెలిపారు.

తొలి ఓటు సంబరం..

మధురానగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేయడానికి యువత ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సోమవారం ఉదయం ఆరు గంటలకే పోలింగ్ కేంద్రాలకు వచ్చి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మొదటిసారి ఓటేసిన వారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ఓటు వేయడానికి లండన్ నుంచి వచ్చా



దేవీనగర్‌కు చెందిన నేను ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లాను. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు ఆకర్షితుడిని అయ్యాను. ఎన్నికల్లో ఎలాగైనా ఓటు వేయాలని రూ. లక్ష వ్యయంతో ఫ్లయిట్ టికెట్ కొనుగోలు చేసి ఇండియాకు వచ్చి ఓటు వేశాను. ఎవరు ఎక్కడ ఉన్నా ప్రజలకు మేలు చేసే వారికి ఓటు వేయాలి.

– భాస్కరరెడ్డి, లండన్

తొలిసారి ఓటు వేశా



నాకు నా తొలి ఓటు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి పవిత్రమైనది ఓటు హక్కు. అటువంటి ఓటు హక్కును తొలిసారిగా వేయడం గర్వంగా ఫీలవుతున్నాను. యువత ఖచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకుని తమదైన పాత్రను సమర్థవంతంగా పోషించాలి.

– కే సందీప్‌కుమార్, దావు బుచ్చయ్యకాలనీ



పటమట హైస్కూల్లో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న బంధువులు ; ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు


దుర్గాపురం ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసిన వృద్ధుడు



వీల్‌చైర్‌లో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న దృశ్యం ; ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు

పోటెత్తిన ఓటర్లు

బెజవాడ నగరంలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎటు చూసినా ఓటేసేందుకు వస్తున్న ప్రజలే దర్శనమిచ్చారు. ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన బూత్‌లలో ఏడు గంటలకే క్యూలైన్లు రద్దీగా దర్శనమిచ్చాయి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, యువతులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌కు తరలివచ్చారు. నడవలేని వృద్ధులను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి పోలింగ్‌కు తీసుకొచ్చారు. గంట గంటకూ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొలిసారిగా ఓటు వేసి పలువురు యువతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


పటమట ఎన్ఎస్ఎం స్కూల్ క్యూలైన్‌లో ఓటర్లు


పటమట ఎన్ఎస్ఎం స్కూల్ క్యూలైన్‌లో ఓటర్లు


నూతనంగా ఓటు హక్కును వినియోగించుకున్న యువతి


లయోలా కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రజలు

కౌంటర్లు, క్యూలైన్ల తనిఖీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సేవలపై ఈవో కేఎస్ రామరావు సోమవారం ఆరా తీశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రసాదం కౌంటర్లు, క్లోక్ రూమ్‌లు, చెప్పుల స్టాండ్‌లను తనిఖీ చేశారు. క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్‌లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ తరఫున సిబ్బందితో మాట్లాడారు. భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరో వైపు గాలిగోపురం నుంచి క్యూలైన్ మార్గంలోకి ప్రవేశించిన ఈవో మార్గమధ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణంలో ఇబ్బందులపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో కూలర్లు, మంచినీటి సదుపాయంతో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, ఇంకా ఏమైనా వసతులు కల్పిస్తే బాగుంటుందని బావిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఉదయం 10.30 గంటల నుంచే అమ్మవారి అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నామని, దర్శనం అనంతరం అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించాల్సిందిగా భక్తులకు సూచించారు. అన్న ప్రసాదం పంపిణీపై పదే పదే మైక్‌లో అనౌన్స్ చేయాలని సిబ్బందికి సూచించారు.

వించిపేటలో ఉద్రిక్తత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వించిపేటలో సోమవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. రిగ్గింగ్‌కు పాల్పడిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. మహ్మదాలీపురం యుపీ స్కూల్‌లోని 208వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలకు సీల్ వేసే సమయంలో టీడీపీ నేత ఎంఎస్ బేగ్ పలువురు నాయకులు బూత్‌లోకి ప్రవేశించారు. అదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ఎంఎస్ బేగ్‌ను బూత్‌లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం పెరిగింది. ఆ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు పెరిగాయి. ఒక్కసారిగా ఇరు వర్గాలు ఒకరిపైకి ఒకరు ముందుకు దూసుకురావడంతో పోలీసులు అందరినీ చెదరగొట్టారు. అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు.